# లౌకికం




కందుకూరి వెంకటమహాలక్ష్మి

సుకుమార్ బైటికొచ్చి తలుపులు తాళం వేసాడు. మళ్ళీ పెరటివైపుకి వెళ్ళాడు. వెనక తలుపులు కూడా తాళం వేసాడు. మళ్ళీ బైటికొచ్చి తలుపు తాళం లాగి చూసాడు. బైటికెళ్ళి బైక్ స్టార్టు చేసి బయలుదేరాడు.

ఈ దృశ్యం రోజూ యిరుగూపొరుగులు చూస్తూనే వుంటారు. రోజూ ఆ ఇంటి యజమాని ఉదయం తొమ్మిదిన్నర ప్రాంతంలో ఇలా ముందూ, వెనకల తలుపులు తాళాలు వేసి వెళ్ళడం మళ్ళీ మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో రావడం ఓ గంట తర్వాత వెళ్ళి మళ్ళీ సాయంకాలం ఆరూ, ఏడూ మధ్య రావడం తలుపులు తాళాలు తియ్యడం మామూలయింది. పొరుగు వాళ్ళందరికీ ఒకటే సందేహం.

''ఇంట్లో అలా భార్యని పెట్టి రెండువైపులా తలుపులు తాళాలు వేసి వెళ్తాడేమిటి? భార్యపై అంత అనుమానమా? పాపం ఆ యిల్లాలు ఈయన్ని కట్టుకుని ఏం సుఖపడుతోంది. ఎప్పుడూ సూర్యుడి ముఖం కూడా చూసి వుండదు. ఎంత అనుమానం అయితే మాత్రం అంతలా ఇంటికి తాళాలు వేసి మరీ వెళ్తాడా? ఇతనికీ భార్యమీద అనుమానమా? లేక ఆమె ఏదన్నా కూడని పని చేసిందా? ఎంత చెడ్డ భర్తయినా భార్యని ఇంట్లో పెట్టి అలా బందిస్తాడా?'' అని కొందరు అనుకుంటే, శాడిస్టు భర్తలు భార్య పరాయి పురుషుల్ని ఎవర్నేనా సూస్తుందేమో అని అనుమానం అనీ, భార్యని ఎవరన్నా మగవారు చూస్తారేమో అనీ అలా యింట్లో బందిస్తారనీ మరికొందరూ అనుకునేవారు.

అంతేకాకుండా అప్పుడప్పుడు ఆ యింట్లోంచి రాత్రిళ్ళు ఏడుపూ, గోల, అల్లరీ కూడా వినపడేది. దాంతో భార్యని భర్త కొట్టడమో, హింసించడమో చేస్తున్నాడని అంతా బాధపడేవారు. కానీ ఎవ్వరికీ ఆ ఇంటి యజమానిని ఆ విషయం అడిగే ధైర్యం ఉండేది కాదు.

ఆ యిల్లు కూడా వూరికి చివరన ఉన్న ఇళ్ళ మధ్య వుంది. సుకుమార్ యింటి చుట్టూ స్థలం మధ్యలో బంగాళా పెంకుటి చిన్న యిల్లూ. వెళ్తూ వెళ్తూ సుకుమార్ గేటు కూడా తాళం వేసి వెళ్ళడంతో ప్రహరీగోడ దాటి లోపలికి వెళ్ళే సాహసం ఎవ్వరూ చెయ్యలేక పోయేవారు.

అతను ఆ యింటికి వచ్చి ఏడాది కావస్తోంది. ఉదయం వెళ్ళడం మధ్యాహ్నం రావడం,మళ్ళీ ఓ గంట తరువాత వెళ్ళడం సాయంకాల రావడం తప్ప ఇరుగూ పొరుగుల్నెప్పుడూ పలకరించడం గానీ, మాట్లాడటం గానీ చెయ్యలేదు.

ఈ విషయం ఆ చుట్టు పక్కల యిళ్ళ వాళ్ళకి ఆడా మగకీ ఒక చర్చనీయాంశమయింది. అయినా ఎవ్వరూ సాహసించి సుకుమార్‌ని ప్రశ్నించలేక పోయే వారు.

ఆరోజు రాత్రి ఆ ఇంట్లోంచి చాలా గట్టిగా కేకలూ, గోలా వినపడటంతో దగ్గరిళ్ళ వాళ్ళంతా వచ్చారు. సాహసించి గోడ దూకి లోపలికెళ్ళారు. ఆలుపులు గట్టిగా కొట్టారు. సుకుమార్ తలుపు తీసాడు. వాళ్ళల్లో ఒకడు ముందుకొచ్చి "ఏంటండీ రాత్రివేళ ఈ గొడవ ఎందుకామెనలా హింసిస్తారు? ఎంతయినా భార్య భార్యే కదా!" అని అనగానే సుకుమార్ వాళ్ళకేసి చూసి "దయచేసి మీరంతా యిళ్ళకి వెళ్ళిపొండి. మాగొడవేదో మేం పడతాం. నా భార్య నా యిష్టం.'' అంటూ తలుపు తీసెయ్యడంతో వచ్చిన నలుగురూ ఏమీ మాట్లాడలేక, ఒకరినొకరు చూసుకుని తిరుగుముఖం పట్టేరు.

కిరాతకుడూ, దుర్మార్గుడూనూ. ఇలాంటి భర్తలు దేశంలో వుండబట్టే కొందరు స్త్రీలు మగవాళ్ళని దుయ్యబడుతున్నారు. అంత అనుమానమున్న భర్త విడాకులిచ్చేసి ఆమెకి విముక్తి కలిగించవచ్చు కదా ! పగలూ, రాత్రీ అలా బందిఖానాలో బందించి హింసించకపోతే! ఎప్పుడో యిలాంటివాడి మీద పగతో ఏ హత్య చేసినా ఆశ్చర్యపడనక్కర లేదు" అనుకున్నారంతా.


ఇలా ఆ ఇంట్లో గొడవ రోజురోజుకీ ఎక్కువ కాసాగిందే తప్ప తగ్గటం లేదు. భరించలేక ఆ ప్రక్కవాళ్లంతా కలిసి పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళి అతడు భార్యని బాధించే విషయాలు చెప్పి కంప్లయింట్ రాసిచ్చి వచ్చారు. పోలీసుల్ని రాత్రి ఏడు దాటాకా రమ్మని ఆ యింటి అడ్రస్ యిచ్చి వచ్చారు.

మర్నాడు పోలీసులు వచ్చేసరికి సుకుమార్ యింట్లో ఏడుపులూ, అరుపులూ వినపడటంతో పోలీసులు రంగంలోకి దిగి సుకుమార్ ఇంటి తలుపులు కొట్టారు. తలుపులు తీసిన సుకుమార్ నిశ్చేష్టుడై వారిని చూస్తూ అలా నిలబడిపోయాడు.

పోలీసులు లోపలికెళ్లి "భార్యని ఇంట్లో బంధించి హింసిస్తున్నావని మాకు కంప్లెయింట్ వచ్చింది. ఈరోజు మా చెవులతో ఆమె ఏడుపు విన్నాం. నిన్ను వెంటనే అరెస్టు చేస్తున్నాం. పద పోలీసు స్టేషన్‌కి అన్నారు.

అతను కళ్ళనీళ్ళెట్టుకుంటూ "సార్ ! మీరొక్కసారి వచ్చి కూర్చొండి. నేను విషయం చెప్తాను." అంటూ వాళ్ళని లోపలికి తీసుకెళ్ళి తలుపులేసాడు. ఏమీ అర్థం కాని పోలీసులు వెళ్ళి కూర్చున్నారు.

సార్ ! మాది ప్రేమ వివాహం మా వాళ్ళెవ్వరూ మా పెళ్ళికి ఒప్పుకోలేదు. కులాంతరమనీ, మా అంతస్తులు ఒకటి కావనీ అడ్డుకున్నారు. దాంతో యిద్దరం వచ్చి గుళ్ళో పెళ్ళి చేసుకున్నాం. పెళ్ళయ్యాక నా భార్య తరుపు వాళ్ళకీ నా వాళ్ళకీ ఉత్తరాలు రాసా. రెండు కుటుంబాల నుంచీ ఒకేలాంటి సమాధానాలు వచ్చాయి. నాకు చెల్లెలే లేదనుకుంటానంటూ మీనా అన్నా, ఇల్లు దాటగానే నా కొడుకు చచ్చిపోయాడనుకున్నానంటూ నా వాళ్ళూ ఉత్తరాలు రాసారు. దాంతో ఇలా ఒకరికొకరమై పదిహేనేళ్ళుగా అన్యోన్యంగా కలిసి కాపురం చేస్తున్నాం. మీనా పెద్దింటి పిల్లయినా నా జీవితంతో కలిసిపోయి, సర్దుకుని బ్రతకుతోంది. మాకు ఎవ్వరూ లేరన్న లోటుని, ఒకరికొకరమే వుండి మర్చిపోయాం. మా జీవితాలలో ఓ వసంతం వచ్చింది. మాకో అమ్మాయి పుట్టింది. అచ్చు తల్లిపోలిక. చక్కగా, బొద్దుగా, ముద్దుగా వుండేది.



ఇన్నేళ్ళూ ఒకరి కొకరమే కావడం - ఈ పాప పుట్టడంతో మా యింట్లో చెప్పలేని ఆనందం కలిగింది. ఆ పాపకి మీనా "అపరాజిత" అని పేరు పెట్టింది. ఎవ్వరూ నా అనేవాళ్ళు లేని మాకు అపరాజితే సర్వస్వం అయింది. మీనా అపరాజితని ఒక్క క్షణం వదిలేది కాదు. అపరాజితే తన జీవితం అన్నట్లుండేది మీనా. ప్రతి ముచ్చటా శక్తి వున్నంతలో తీర్చేవాళ్ళం. స్కూల్లో వేసే టైం రాగానే మంచి స్కూల్లో వేసాం. అలాంటి ఆనందమయ జీవితపు పాల కుండలో ఓ రోజు ఓ విష బిందువు పడింది.

స్కూలుకెళ్ళిన అపరాజిత సాయం కాలం ఇంటికి రాలేదు. పదకొండేళ్ళ అపరాజిత తనంతట తనే స్కూలు నుంచి బస్సు దిగి ఇంటి కొచ్చేది. అలాంటిది ఆరోజు రాకపోవడంతో మీనా నాకు కబురు పంపింది. ఇద్దరం కంగారు పడ్డాం. స్కూలుకెళ్ళి అడిగాం. బస్సు ఎక్కిం దన్నారు. బస్సుడ్రైవరు స్టాపులోనే దిగిందన్నాడు. అపరాజిత స్నేహితులందర్నీ అడిగాం తమకి ఏమీ తెలీదన్నారు. రాత్రల్లా ఆందోళన చెందాం. స్నేహితుల సహాయంతో వూరంతా వెతికాం. తెల్లవారగట్ల ఇంటికొచ్చేసరికి అపరాజిత శవం దొడ్లో పడివుంది. ఆమె చేతిలో ఓ ఉత్తరం.

మమ్మల్ని ఊళ్ళో తలెత్తుకోకుండా చేసినదాని ఫలితం అనుభవించండి -

ఇలా

మామయ్య రాజు

అని టైపు చేసిన ఉత్తరం వుంది. ఆ శవాన్నీ, ఆ ఉత్తరాన్నీ చూసిన మీనా స్పృహ తప్పి పడిపోయింది. తెలిసిందేమిటంటే అపరాజితని రేప్ చేసి చంపేశాడనీ పెళ్ళయి యిన్నేళ్ళయినా వాళ్ళకి మా మీద కక్ష తీరలేదని బాధపడ్డాం.

ఆనాటి లగాయతూ నా భార్య మీనా యిలా పిచ్చిదానిలా తయారయిపోయింది. ఆరోజు నుంచీ తన్ని రాజు దగ్గరికి వెళ్ళనివ్వ మనీ, రాజుని హత్య చేసి వస్తాననీ రోజూ గొడవ చేస్తుంది.

ఎంతో వైద్యం చేయించాను. డాక్టర్లు పిచ్చాసుపత్రిలో పెట్టమన్నారు. అక్కడి బాధల్ని నా మీనా తట్టుకోలేదని పెట్టలేదు. దాంతో నేను ఆ వూరి నుంచి మీనాని తీసుకొచ్చి ఈ వూర్లో, ఈ ఇంట్లో పెట్టాను. నేనిక్కడో ఉద్యోగం సంపాదించి కాలం గడుపుతున్నాను.

మార్పుకోసం ఈవూరు తీసుకొచ్చాను. ఈ వూరు వచ్చినట్లు తనకి తెలీటం లేదు. నన్ను చూడగానే గొడవ ప్రారంభిస్తుంది. ఉదయం కాఫీ, టిఫినూ యిచ్చి వెళ్తాను. మధ్యాహ్నం వచ్చి భోజనం పెడతాను. రాత్రి భోం చేసాకా పడుకోమంటే పడుకోదు-ఇలా గొడవ చేస్తుంది. నేను ఉదయం వెళ్ళేముందు డాక్టర్ సలహా మేరకు మత్తుఇంజక్షన్ చేస్తాను. రాత్రి చెయ్యను. దాంతో సాయంకాలం నుంచీ ఇలా పేచీ మొదలెడుతుంది. తను చేసే గొడవల్లా "నన్ను వెళ్ళనివ్వండి ఆ రాజుని చంపేసి వస్తాను. అప్పుడే నా అపరాజిత మనస్సుకి శాంతి" అంటుంది.

ఇదండీ మా అనురాగమయ జీవితాలని నాశనం చేసిన సంఘటన. మా ప్రేమమయ జీవితాలని దుఃఖమయ జీవితాలని చేసి వారి కసి తీర్చుకున్నారు. మీనా అన్నకీ విషయం తెలిస్తే మా తమ్ముడి కేం ఖర్మ ఇలా చెయ్యడానికి ఎవరో చేసి మావాడి పేరెట్టి వుంటారు అన్నాడు. రుజువు లేదు. ఏం చేస్తాం?

అప్పటినుంచీ మీనా పరిస్థితి ఇలాగే వుంది. మీనా నాప్రాణం తను లేందే బ్రతకలేను.

ఇదీ మా కథ. రోజూ మా మీనా చేసే గొడవకి కారణం ఇదీ - ఏం చెయ్యమంటారో చెప్పండి సార్ అన్న సుకుమార్ మాటల్ని విన్న పోలీసులు ఏమీ మాట్లాడలేక, గదిలోకెళ్ళి మంచం మీద పడున్న మీనాని చూసి జాలిగా వెనుతిరిగి బైటికొచ్చారు.

సుకుమార్ని అరస్టు చేసి తీసుకెళ్తారని ఎదురు చూస్తున్న ఇరుగు, పొరుగులు పోలీసులు సుకుమార్ని అరెస్టు చెయ్యకుండా అంతసేపూ కూర్చుని వెళ్ళిపోవడంతో చుట్టు పక్కల వాళ్ళంతా ఆశ్చర్యంగా చూస్తూ "ఏదో బాగా లంచం పెట్టి వుంటాడు" అనుకున్నారు.

అందుకే వాళ్ళని ''లోకులు'' అంటారు. సుకుమార్ జీవితానికి త్వరలోనే శాంతి కలగాలని ఆకాంక్షిద్దాం.

## మాట్లాడాలి

చాలా కాలమైంది
మనుషులతో మాట్లాడి
ఆ మాటకొస్తే
నాతో నేను మాట్లాడుకుని కూడా
ఒక మనిషి మరో మనిషితో
మాట్లాడడమంటే
మనసు కట్లు విప్పి
అక్కడ పెట్టి
మాటలై ప్రవహించడం కదా !
ఒక మనిషి మరో మనిషితో
సంభాషించడమంటే
ఆత్మల కరచాలనం కదా !
మనుషులు మాట్లాడుకోవడమంటే
గుండె బరువును
కాసేపు దించుకోవడం కదా !
నిజమే !
అటువంటి హృదయానుభూతి పొంది
ఎన్ని యుగాలయ్యింది !
శబ్దాలు తప్ప
మాటలు లేని యాంత్రిక రొదలో
పెదాలపై నవ్వులు తప్ప
మనసు చెమ్మ తగలని చోట
నిజంగా
యిద్దరు మనుషులు పరస్పరం
మాటలు కలబోసుకోవడమంటే
అరుదైన సంఘటనే !
నాకిప్పుడు ఒక్కసారిగా
మా పల్లెటూర్లో
హైస్కూలు విద్యార్థినై పోయి
బాలనేస్తాలతో
చెరువు గట్టు మీదగా
యింటినుంచి స్కూలుకి
స్కూలు నుంచి యింటికి
వచ్చి పోయేటప్పుడు
ఎక్కడ బడితే అక్కడ నిలబడి
గంటల తరబడి
మాటల వూటల్లో
తనివి తీరా
తడిసి ముద్దవ్వాలనుంది

- చల్లపల్లి స్వరూపరాణి